విశాలాంధ్ర కృష్ణా జిల్లా

వరి నాట్లు ప్రారంభం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలో వరి నాట్లు ప్రారంభమవడంతో రైతులు పంట పొలాలలో బిజీ బిజీగా ఉన్నారు. మండలంలోని మహేశ్వరపురం గ్రామ పొలాలలో వరి నారు మడులు జూన్ నెలలో విత్తనాలు బోరు నీటి ద్వారా పోయడం జరిగింది. సుమారు నెలరోజులు కావస్తున్న తరుణంలో నాటు వేయటానికి నారు అనువుగా ఉంది. పంట కాలువల ద్వారా సాగునీరు విడుదల కాకపోవడంతో (భూమి వాటర్) బోరు ద్వారా పొలాలను తడిపి బోరు నీటితో(ఊడుపు) నాటు వేయడం జరుగుతుందని రైతులు, కౌలు రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట కాలువల ద్వారా సాగునీరు విడుదల చేస్తే త్వరితగతిన వరి నాట్లు పూర్తవుతాయని ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ కంపెనీల వసూళ్లు!

సురక్ష ట్యూబ్, ఉచిత గ్యాస్ కోసం ఈకేవైసీ అని ప్రచారం

వినియోగదారుల పడిగాపులు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : మచిలీపట్నంలో గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకునే క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం సంవత్సరానికి 3 గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని చేసిన వాగ్దానం అమలు, ఆ పథకం విధివిధానాలు రాకముందే దీనికోసం ఇకెవైసి అంటూ గ్యాస్ డీలర్లు తమను అవస్థలపాలు చేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ డీలర్లు కనక్షన్ తీసుకుని 5 సంవత్సరాలు దాటిన ప్రతి వినియోగదారుడు ఇకెవైసి చేసుకోవాలని, సురక్ష ట్యూబు ను తప్పకుండా కొనుగోలు చేయాలని వినియోగదారుల నుంచి 200 రూపాయలు వసూలు చేస్తున్నారు. దీనిని ప్రశ్నించిన తమను డీలర్లు ఇష్టం వచ్చినట్లు అవమానకరంగా, అసభ్యంగా మాట్లాడుతున్నా రని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. డబ్బులు వసూలు చేస్తూ కొందరికి సురక్ష ట్యూబ్ ఇవ్వడంలేదని చెబుతున్నారు.

వినియోగదారుల అవస్థలు

మచిలీపట్నంలో ఉన్న గ్యాస్ వినియోగదారులు అంతా పరిసర ప్రాంతాల నుండి కూడా ఇకెవైసి చేయించు కునేందుకు ఒకేసారి రావడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. అక్కడ ఎలాంటి నీడ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈకేవైసీకి, ఉచిత గ్యాస్‌కు సంబంధం లేదు

తహశీల్దారు ఎన్ వెంకటేశ్వరరావు

ప్రభుత్వం అందిస్తామని చెప్పిన ఉచిత గ్యాస్ సిలెండర్లకు, ప్రస్తుతం గ్యాస్ డీలర్లు చేసే ఇకెవైసికి ఎలాంటి సంబంధం లేదని తహశీల్దారు ఎన్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉచిత గ్యాస్ కు సంబంధించిన విధివిధానాలు ఇంకా రాలేదని దీనినిమిత్తం డీలర్లకు ఎలాంటి పైకం కట్టనవసరం లేదని అలా కట్టించుకున్న వారు తహసీల్దారు కార్యాలయంలో తెలపాలన్నారు.

మురుగు పారుదలకు చర్యలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవ తో పంచాయితీ సిబ్బంది పనులు పరుగు పెట్టిస్తున్నారు. సీతాయలంకలోని డ్రైనేజి సమస్యను మంగళవారం మండలి బుద్ధప్రసాద్ పరిశీలించగా మండలి ఆదేశించిన 24 గంటల వ్యవధిలో సమస్యకు పరిష్కారం చేశారు. ఈ నెల 1 వ తేది సోమవారం బుద్ధప్రసాద్ సీతాయలంకలో నిర్వహించిన డయేరియా అవగాహన సదస్సుకు విచ్చేసే సమయంలో రహదారిపై మురుగు నీరు నిలిచి ఉండటం పరిశీలించి సమస్యకు కారణాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని పంచాయితీ అధికారి శ్రీనివాసుకు సూచించగా పంచాయితీ సిబ్బంది ఈ సమస్యను పరిష్కారం చేశారు. సిమెంటు రోడ్డు మధ్యలో తూము వేయించి మురుగు మళ్ళింపు చర్యలు చేపట్టడంతో కొంత కాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యను మండలి పరిశీలించిన వెంటనే పరిష్కారం చూపించిన బుద్ధప్రసాద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి : కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- నియోజకవర్గంలో టూ వీలర్స్ మెకానిక్ సోదరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. ప్రపంచ టూ వీలర్స్ మెకానిక్ వర్కర్స్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం బంటుమిల్లి ,కృత్తివెన్ను మండలంలోని టూ వీలర్స్ మెకానిక్ లు యువగణేష్ మోటర్ మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యతిథిగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు, బొర్ర కాశీ, జొన్నలగడ్డ కొండలరావు, రేవు గోపాలకృష్ణ, బంటుమిల్లి, టూ వీలర్స్ మెకానిక్‌లు, సహాయ వర్కర్లు పాల్గొన్నారు.

'డెంగీని నివారిద్దాం-ప్రజారోగ్యాన్ని కాపాడుకుందాం'

విశాలాంధ్ర-బంటుమిల్లి :- డెంగీని నివారిద్దాం, ప్రజారోగ్యాన్ని కాపాడుకుందాం అంటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద తుమ్మిడి వైద్యధికారి వి జయశ్రీ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాలు కార్యక్రమంలో బాగంగా బుదవారం వైద్యాధికారి వి జయశ్రీ ఆధ్వర్యలో మలేరియా, డెంగ్యూ, బోదకాలు వంటి జ్వరాలు రాకుండ అవగాహన మరియు నియంత్రణ చర్యలు చేపట్టడం జరిగింది అన్నారు. పి హెచ్ సి పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో ప్రతి రోజు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ ఏడు కొండలరావు,హెల్త్ సూపర్ వైజర్ ఎం ఏసుదాసు, హెచ్ వి కమల రత్నం, ఎ ఎస్ ఎం స్వాతి ,హెల్త్ అసిస్టెంట్ యునస్, రాజారావు, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

'అమ్మ'పేరుతో మొక్కలు నాటిన నాయకులు

విశాలాంధ్ర-కూచిపూడి : పర్యావరణ పరిరక్షణ కోసం, గ్రామాలలో పచ్చదనం పెంపుదల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుతో ఎన్ డి ఏ నాయకులు కూచిపూడి సచివాలయంలో మొక్కలు నాటారు. "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నరేంద్రమోడీ ఆశయాలకు అనుగుణంగా కృష్ణాజిల్లా బిజెపి పార్టీ ఓబీసీ అధ్యక్షుడు డాక్టర్ పోలనఅశోక్.కుమార్ పర్యవేక్షణలో టిడిపి, జనసేన నాయకులు కూచిపూడిసచివాలయంలోమొక్కలు నాటారు. ఆయా పార్టీల నాయకులు కూచిపూడి పంచాయతీ గ్రేడ్ వన్.కార్యదర్శి ఇస్లావత్ భవాని, సచివాలయ సిబ్బంది ఏ అరుణకుమారి (డిజిటల్ అసిస్టెంట్), అగ్రికల్చరల్ అసిస్టెంట్ జే. కుమారసోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి సదరం బుకింగ్

విశాలాంధ్ర-కూచిపూడి : అంగవైకల్యం ధృవీకరణ పత్రాల కోసం గురువారం నుంచి సచివాలయాలలో సదరం స్లాట్ బుకింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మొవ్వ ఎండిఓ.జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈనెల 4వ తారీఖు నుంచి ప్రారంభించే సాధన స్లాట్ శిబిరాలు సెప్టెంబర్ వరకు నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని వివరించారు. దీనికోసం అర్హులైన లబ్ధిదారులు మీ సేవ, సచివాలయాలలో గాని ముందస్తుగా స్లాట్ నమోదు చేసుకోవాలని సూచించారు. మొవ్వ మండలం లోని 16 సచివాలయాలలో డిజిటల్ అసిస్టెంట్ ల వద్ద కానీ, సమీపంలోని మీ సేవ కేంద్రాల లోకానినమోదు చేసుకోవచ్చని దీనికోసం అవసరమైన ధృవపత్రాలు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్ దినోత్సవం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు శ్రీ సూర్య భగవాన్ మోటర్ సైకిల్ అసోసియేషన్ అధ్యక్షులు చెమిటి రాజా అధ్యక్షతన రాజా మెకానిక్ షెడ్ వద్ద కేకను కట్ చేసి మెకానిక్ దినోత్సవ శుభాకాంక్షలు ఒకరికి ఒకరు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ మెకానిక్‌లు అందరూ కలిసి కట్టుగా ఒక తాటిపైకి రావాలని, మన సమస్యలను పరిష్కరించుకోవాలంటే ఒకే మాట, ఒకే బాట గా నడవాలని మెకానిక్‌ల ఐక్యత వర్ధిల్లాలని, మెకానిక్‌లు అంతా సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అవనిగడ్డ వెంకటేశ్వరరావు, అవనిగడ్డ నాగమల్లేశ్వరరావు, బాబావలి, గణేష్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా 'గ్రీన్ ఇండియా'

విశాలాంధ్ర-అవనిగడ్డ : గ్రీన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం గ్రీన్ ఇండియా మిషన్ స్మార్ట్ లివింగ్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి అవనిగడ్డ సిఐ త్రినాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. ప్రతి ఒక్కరూ మొక్కటి నాటి పచ్చదనాన్ని పెంచండి అని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్యశాల సూపరిడెంట్ జయకుమార్ మాట్లాడుతూ అడవులను, మొక్కలను నరికివేయడం వలన వాతావరణంలో మార్పులు వస్తున్నాయని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచి పోషించి వాతావరణంలో వస్తున్న మార్పులను అధిగమించేలా పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఆదాల రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అశోక్ కుమార్, డీన్ సుధాకర్, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్తహతం

క్షణిక ఆవేశంలో స్ర్కూ డ్రైవర్ తో కంఠంపై పొడిచి హత్య !

కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న పోలీసులు

విశాలాంధ్ర-బంటుమిల్లి : బంటుమిల్లి మండల పరిధిలోని చిన్న తుమ్మిడి గ్రామంలో భార్య చేతిలో భర్త హతమైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుసిమి అప్పారావు (30), కీర్తన (26)లకు తొమ్మిది ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరు సంవత్సరాల బాబు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య వివాదం ఏర్పడగా, తన భర్త అయిన అప్పారావును భార్య కీర్తన క్షణికావేశంలో స్ర్కూ డ్రైవర్‌తో కంఠంపై పొడిచింది. దీంతో గుసిమి అప్పారావు మరణించారు. దీనిపై అప్పారావు సోదరి తెర్లాపు అచ్చుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటుమిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే సీఐ కే నాగేంద్రప్రసాద్ బుధవారం సంఘటన స్థలానికి వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. మచిలీపట్నం క్లూస్ టీం కూడా ఘటన ప్రాంతంలో వివరాలు సేకరించారు. అయితే ప్రశాంతమైన పక్కా పల్లెటూరు వాతావరణం అయిన చిన్న తుమ్మిడి గ్రామంలో ఈ హత్య వార్త పరిసర ప్రాంతాల్లో సంచలనం రేకితిచ్చింది. ఎక్కడో పట్టణాల్లో జరిగే ఇటువంటి సంఘటనలు గ్రామాల్లో కూడా చోటు చేసుకోవటం ఇక్కడ వారికి ఆశ్చర్యం కలిగింది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని కొంతమంది, లేదా వివాహేతర సంబంధమా అని కొంతమంది చర్చించుకుంటున్నారు. ఏదేమైనా విచారణలో విషయాలు తెలియ రావాల్సి ఉంటుంది.

పంటఉత్పత్తి రైతు సంఘాలకు

ప్రోత్సాహం అందించాలి

విశాలాంధ్రబ్యూరో మచిలీపట్నం : పంట ఉత్పత్తి రైతు సంఘాలకు (ఎఫ్ పిఓలు) కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా అనేక ప్రయోజనాలు అందిస్తోందని, పంట ఉత్పత్తి రైతుసంఘాలకు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకోసం నాబార్డు 5 సంవత్సరాలలో 43 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తోందని వారికి తగిన ప్రోత్సాహం అందించాలని జేసీ గీతాశర్మ అన్నారు. బుధవారం సాయంత్రం సంయుక్త కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో నాబార్డ్ కేంద్ర రంగ పథకం అవగాహనపై వ్యవసాయ అనుబంధ శాఖలు, నాబార్డు అధికారులు, రైతులతో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 25 బ్లాక్ లకు గాను 22 బ్లాక్ లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు పండించే రైతులతో పంటఉత్పత్తి సంఘాలు ఏర్పాటు అయ్యాయన్నారు. మిగిలిన కృత్తివెన్ను, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో కూడా ఉత్పత్తుల రైతు సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. పంట ఉత్పత్తి రైతు సంఘాలకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, మండి తదితర లైసెన్సులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందుటకు సానుకూలంగా వ్యవహరించాలన్నారు. పంట ఉత్పత్తి రైతు సంఘాల ఆర్థిక పురోభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. పంట ఉత్పత్తి రైతు సంఘాల వలన రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా వినియోగదారులకు కూడా నాణ్యత గల పంట ఉత్పత్తులు సరసమైన ధరలకు లభించి లాభదాయకంగా ఉంటుందన్నారు. ఎఫ్ పి ఓ లు వ్యాపారం చేసుకొనుటకు కావలసిన లైసెన్సులు, వాటిని పొందుటకు అవసరమైన అర్హతలు, డాక్యుమెంట్లు తదితర వివరాలను తెలియజేయాలన్నారు. వారికి సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యం పెంపుదల కోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎఫ్ పి ఓ లతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సమావేశంలో నాబార్డ్ డీడీఎం మిలింద్ చౌశాల్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, వ్యవసాయ శాఖ డిడి మనోహర్,ఎడి మణిధర్, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి జే జ్యోతి, ఏపీఎంఐపీ అధికారి విజయలక్ష్మి, డిసిఓ చంద్రశేఖర్ రెడ్డి, జి ఎస్ టి ఓ పరుశురాము, ఎల్ డి ఎం జయవర్ధన్, పలువురు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మెకానిక్ డే ...

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరు లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యంత శక్తివంతమైన కార్మిక సంఘాలలో ఒకటైన టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ప్రపంచ మెకానిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ టూ వీలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దయనేని ధర్మారావు ఇచ్చిన పిలుపు మేరకు గుడ్లవల్లేరు టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ సభ్యులు బుధవారం ఉదయం కేక్ కట్ చేసి, యూనియన్ లోని మెకానిక్ లకు ఐడెంటిటీ కార్డు అందజేశారు. అనంతరం గుడ్లవల్లేరు లో మోటర్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్ యూనియన్ నాయకులు, సభ్యులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వారికి అభివృద్ధికి అవసరమైన ఏడు వినతుల (1.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి టూ వీలర్ మెకానిక్ కు కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలి. 2. ప్రభుత్వం టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి. 3. టూ వీలర్ వెల్ఫేర్ బోర్డ్ ద్వారానే ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కార్మికునికి ప్రమాద భీమా, వైద్య సాయం కొరకు మరియు సాధారణ, ప్రమాదవశాత్తు జరిగే మరణాలకు ఆయా కుటుంబాలకు ఆర్థికంగా నిలదొక్కుకొనేం దుకు సహాయం చేయాలి. 4. ప్రస్తుతం టూ వీలర్స్ మెకానిక్ వృత్తిలో వచ్చిన విప్లవాత్మక నూతన, బి.యస్-5, బి.యస్-6,7టెక్నాలజీనీ ప్రభుత్వ ఈ వెల్ఫేర్ బోర్డ్ ద్వారా కార్మికులకు నేర్పించాలని, ఎలక్ట్రికల్ బైకులు, స్కూటర్ల మరమత్తులు చేయడం వంటివి నేర్పించడం, తద్వారా నూతన తరానికి కూడా ఈ రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగు పరచేందుకు మరియు స్వతంత్రంగా ఆత్మగౌరవంతో జీవించేందుకు అవకాశం కల్పించాలి. అనంతరం ర్యాలీగా స్థానిక పోలీస్ స్టేషన్ కు వెళ్లి గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మెకానిక్ యూనియన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఎస్ఐ సత్యనారాయణ మెకానిక్ లతో మాట్లాడి వారికి కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ హుస్సేన్, సెక్రటరీ ఫరీద్, ట్రెజరర్ ఉపేంద్ర, యూనియన్ సభ్యులు కిషోర్, సురేంద్ర, శ్రీనివాసరావు, సుభాని, రవి, భషీర్, సత్యనారాయణ, ముభీన్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఉప్పులోడు లారీ బోల్తా

విశాలాంధ్ర-చల్లపల్లి : జాతీయ రహదా రిపై చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద బుధవారం మధ్యాహ్నం రోడ్డుప్రమాదం జరిగింది. ఉప్పులోడుతో వస్తున్న లారీ బైక్ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా కొట్టగా, ద్విచక్రవాహనం సైతం గోతిలోకి దూసుకు వెళ్లటంతో బైక్‌పై ఉన్నవారికి గాయాల య్యాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రాణాపాయం తలెత్తలేదు. మచిలీపట్నం మండలం కోన గ్రామానికి చెందిన కె.శ్రీను, బి.శ్రీను అనే వ్యక్తులు మంగళాపురం వచ్చి తిరిగి హైవేమీదుగా వస్తున్నారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచీ గిలకలదిండి వెళుతున్న ఉప్పులారీకి బైక్ అడ్డురావటంతో బైకును తప్పించబోయి లారీని పక్కకు తిప్పగా అదపుతప్పి మార్జిన్లోకి బోల్తాకొట్టింది. బైక్ సైతం గోతిలోపడిపోగా, ఇద్దరికీ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మోపిదేవి 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ కమల్ రాజు, పైలట్ శ్రీచందు ఘటనా స్థలికి చేరుకుని ప్రాథమిక చికిత్సలు అందించి క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ తోట శ్రీను అదృష్టవశాత్తూ ప్రాణాపాయం లేకుండా బయటపడ్డాడు. చల్లపల్లి ఎస్ఐ సిహెచ్.చినబాబు సంఘటనా ప్రదేశానికి చేరుకుని ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.

టూ వీలర్ సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ జయంతి

విశాలాంధ్ర-చల్లపల్లి : టూ వీలర్ సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ జయంతి వేడుకలు, అంతర్జాతీయ మెకానిక్ దినోత్సవ వేడుకలు బుధవారం చల్లపల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీ టూవీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నబీఘోరి, చల్లపల్లి అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లూరి ప్రేమ్చంద్, ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ భాషు, దాసరి శ్రీనివాస్, పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యల కోసం పోరాటం

విశాలాంధ్ర-కూచిపూడి : గత ప్రభుత్వం తెచ్చిన కౌలు రైతు చట్టాన్ని రద్దుచేసి 2011 భూ రైతుల చట్టాన్ని అమలు చేయాలని కౌలు రైతు సంఘంజిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలో బుధవారం దీనికోసం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించి కౌలు రైతుల సంతకాలు సేకరించారు. భూ యజమానుల సంతకం తో సంబంధం లేకుండా గ్రామ రెవిన్యూ అధికారులు కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు ఇవ్వాలని, తద్వారా పంట రుణాలు, పంట బీమా, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు రైతులకు అందేలా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు వెంకటేశ్వరరావు, గురవయ్య, నాగేంద్ర, కోటేశ్వరరావు తదితరులుతోపాటు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రారంభం

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక ఏలూరురోడ్డులోని ఆదిత్య డిగ్రీ కళాశాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, విశ్వభారతి చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, విద్యాలయ కర్సపాడెంట్ ఎస్.రాంబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ రాష్ట్రంలో 33 డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసిన ఆదిత్య విద్యాసంస్థలు గుడివాడలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కళాశాలలో విద్యను అభిసించిన వారు ఉద్యోగలను తర్వగా సాధించిన ఘనత ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆదిత్య చైర్మన్ మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎస్.శేషరెడ్డి, డైరెక్టర్ ఎస్. సుగుణరెడ్డి, ప్రిన్సిపల్ సిహెచ్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : లవ్ అండ్ కంపాషన్ మినిస్ట్రీస్ వేశపోగు జాకబ్ మెమోరియల్ చర్చ్ వేశపోగు జాక్ టీమ్, జాక్ బ్రెంట్ రాయ్, రేవ పాస్టర్ వేశపోగు విజయబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్, స్టడీ మెటియర్ అందజేయడం అభినందనీయ మని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని లవ్ అండ్ కంపాషన్ మినిస్ట్రీస్ వేశపోగు జాకబ్ మెమోరియల్ చర్చ్ అవరణలో విద్యార్థులకు ఉచితంగా నోట్స్ బుక్స్ స్టడీ మెటిరియల్‌లను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు పెద్దు శ్రీకాంత్ చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ దేవుని కృపవల్ల చర్చి అధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమలు నిర్వహించడం అందులో కుష్టి వ్యాధిగ్రస్తులకు వస్తువులు పంపిణీ, ఏజెన్సీలో ఉన్న ట్రైబల్ ప్రజలకు దుస్తులు, ఆహర వస్తువులు పంపిణి చేయడం గొప్ప విషయమన్నారు.

కొనసాగుతున్న డ్రైనేజీల ప్రక్షాళన

విశాలాంధ్ర-అవనిగడ్డ : పంచాయితీ పరిధిలో డ్రైనేజి ప్రక్షాలన గత నాలుగు రోజులుగా నిర్విరామంగా కొనసాగుతుంది. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ చొరవతో సీతాయలంకలో డ్రైనేజి సమస్య గమనించిన వెంటనే స్పందించి పంచాయితీ వారిచే 24 గంటల్లో మురుగు మళ్ళింపు చర్యలు చేపట్టిన మండలి బుద్ధప్రసాద్ సూచనల మేరకు పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు సీతాయలంక లోని డ్రైనేజి పనులను బుధవారం కూడా ఈఓ పర్యవేక్షణలోనే కొనసాగించారు. ఆ ప్రాంతంలోని కచ్చా డ్రైనేజిలలో పూడిక తీత, పిచ్చి మొక్కల తొలగింపు డ్రైనేజిలో మురుగు నీరు పారుదలకు అడ్డంకులను తొలగించే పనులను కొనసాగిస్తున్నారు.

వ్యక్తి పై కత్తితో దాడి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో నివసించే తోట సూర్య భాగవన్నారాయణ మూర్తి పై తన ఇంటి సమీపంలో నివసించే ఉసా. సాయి కుమార్ అనే వ్యక్తి చాకుతో దాడి చేయగా సూర్య భగవన్నారాయణ మూర్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే ఉసా. సాయి కుమార్ ఇంటి నుండి ప్రతి రోజూ మురికి నీటిని తోట సూర్య భాగవన్నారాయన మూర్తి ఇంటి మీదకు వదులు చుండగా మూర్తి వారిని ఎన్నో సార్లు అలా చెయ్యవదని వారించాడు. గ్రామంలోని పెద్దల దృష్టిలో ఈ విషయాన్ని పెట్టి వారితో చెప్పించినా సాయి కుమార్ కుటుంబం వారి మాటను లెక్కచేయలేదు. కాగా బుధవారం ఉదయం 10 గంటల సమయంలో మళ్ళీ సాయి కుమార్ మూర్తి ఇంటి పైకి మురుగు నీరు వదులుచుండగా చూసిన మూర్తి ఎన్ని సార్లు చెప్పినా వినరా? అని అడుగగా సాయి కుమార్ మూర్తిని ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడి, చేతితో దాడి చేసి అనంతరం తన తల్లిదండ్రుల సమక్షంలోనే మెడ వెనుక భాగంలో, వెన్ను పూస మధ్య భాగంలో చాకుతో దాడి చేయ్యగా మూర్తిని చికిత్స నిమిత్తం గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన పై కేసు నమోదు చేశామని గుడ్లవల్లేరు ఎస్ఐ జి. సత్యనారాయణ తెలిపారు.

దివ్యాంగులకు ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లాలోని దివ్యాంగులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనుటకు, ఉన్న వ్యాపారంఅభివృద్ధి చేసుకొనుటకు రుణాలు పొందగోరే వారు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సహాయ సంస్థ ఎన్టీఆర్ జిల్లా మేనేజర్ వాగ్దేవు కామ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు రుణాలు ఇచ్చేందుకు జాతీయ దివ్యాంగుల ఆర్థిక, అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ) 2024-25 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.9.15కోట్లు కేటాయించిటన్లు చెప్పారు. దివ్యాంగులు 40% ఆ పైన అంగవైకల్యము కలిగి వయస్సు 18 నుండి 60 సంవత్సరాలు కలవారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు పరిశీలన, ఎంపిక, రుణం మంజూరు కార్యక్రమాలు జాయింట్ కలెక్టరు వారి అధ్యక్షతన జిల్లా స్క్రీనింగ్ కమిటీ ద్వారా జరుగుతుందన్నారు. జిల్లాలోని ఆసక్తి గల దివ్యాంగులు ఈ అవకాశమును సద్వినియోగము చేసుకోవాలని కోరారు. వివరాలకు 08672 - 252637 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

దుప్పట్లు పంపిణీ, అన్నదానం

విశాలాంధ్ర-చల్లపల్లి : అనాథ వృద్ధులకు సహాయం చేయటం ఆదర్శనీయమని చల్లపల్లి ఎస్ఐ సిహెచ్.చినబాబు అన్నారు. స్థానిక జనసేన నాయకులు అడపా అద్దంకి నాంచారయ్య... కృష్ణకుమారి దంపతులు తమ కుమార్తె వాగ్దేవి పుట్టినరోజు సందర్భంగా స్థానిక సీయోను వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం చేసి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎస్ఐ చినబాబు పాల్గొని దాతల సేవానిరతిని అభినందించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

జీడీఎస్‌లపై వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): టార్గెట్‌ల కోసం జీడీఎస్‌లను ఒత్తిడి చేయడం, వేధించడం ఆపాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ విజయవాడ డివిజన్ సెక్రటరీ బీ.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన అధ్యక్షతన జీడీఎస్‌లపై వేధింపులు ఆపాలని విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ పోస్టు పోస్టు ఆఫీసు ప్రాంగణంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అచరణ సాధ్యంకానీ, ఆశాస్త్రీయమైన టార్గెట్ల కోసం జీడీఎస్‌లను ఒత్తిడి చేయడం ఆపేయాలన్నారు. జీడీఎస్‌ల పట్ల అమర్యాదకరమైన భాషను ఉపయోగించకూడదని చెప్పారు. టార్గెట్‌ల కోసం సంవత్సరాకొకసారి ఒత్తిడి నెలకొకసారి వేధింపులు, నేడు ప్రతి రోజు మానసిక క్షోభ. అది విజయవాడ జీడీఎస్ ఉద్యోగుల పరిస్థితి అన్నారు. మహిళా జీడీఎస్ ఉద్యోగులను చులకనగా చూస్తున్నారని అన్నారు. పెయిడ్ లీవ్‌లలో పనిచేసిన జీడీఎస్ సబ్స్టిట్యూట్స్‌కు టీడీఆర్‌సీఏ చెల్లింపులో విపరీతమైన జాప్యాన్ని నివారించి, నిధులు ఎలాట్మెంట్ చేయాలన్నారు. తగినన్ని నిధులు లేవనే సాకుతో పెయిడ్ లీవ్‌లలో పనిచేసిన జీడీఎస్ సబిస్టిట్యూట్స్ కు టీఆర్‌సీఏ చెల్లించడంలేదన్నారు. బ్రాంచ్ పోస్టు ఆఫీసుకు అవసరమైన స్టేషనరీ, ఎస్‌బీఆర్‌డీఎస్, ఎస్ఎస్ఏ కొత్త పాస్‌బుక్స్ వెంటనే ఇవ్వాలని అన్నారు. కొత్త ఖాతాలు తెరిచిన ఖాతాదారులు మూడు, నాలుగు నెలల నుంచి పాస్‌బుక్స్ కోసం వేచి చూస్తున్నారన్నారు.జీడీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని చెప్పారు. ఎస్ఎస్‌పీ ద్వారా ఛీఫ్ పిఎంజీ వినతి పత్రం పంపించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బీ.రామారావు, ఎన్ఈపీఈ గ్రూప్ సీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఎన్‌పీఓ నాయకులు స్వరూప్, బీఎంఎస్ నాయకులు నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): వైసీపీ నాయకులు పై దాడి చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు ఎన్టీఆర్ జిల్లా సీపీ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ నేత మైలవరపు దుర్గారావు, తిరువూరు నియోజకవర్గం ఏ.కొండూరు మండలం కంభంపాడు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీపీ సభ్యురాలు కలసాని నాగలక్ష్మీ పై దాడి చేసిన కూటమి నాయకులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వైసీపీ శిలాఫలకం, జెండా దిమ్మె ధ్వంసం చేశారని, సమ్మెటతో దుర్గారావు పై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈదాడిలో దుర్గారావుకు రక్తపుగాయాలైయ్యాయని తెలిపారు. నాగలక్ష్మీ పై ఎమ్మెల్యే శ్రీనివాస్ అతని అనచరులు సుమారు 1000 మంది ఆమెకు సంబంధించిన నిర్మాణంలో ఉన్నటువంటి ఇల్లు మొత్తం జేసీబీతో కూల్చివేశారని చెప్పారు. ఈ రెండు ఘటనలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీకి ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కైలే అనిల్‌కుమార్, నేతలు మొండితోక అరుణ్‌కుమార్, షేక్.ఆసీఫ్, నల్లగట్ల స్వామిదాస్, సర్నాల తిరుపతిరావు, పోతిన మహేష్, లీగల్ సెల్ సభ్యులు కోటంరాజు వెంకటేష్ శర్మ, ఒగ్గు గవాస్కర్, తదితర వైసీపీ నేతలు సీపీకి కలిసి ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే శ్రీనివారావుపై కేసు నమోదు

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై కేసు నమోదయింది. ఏ. కొండూరు మండలం కంభంపాడులో మంగళవారం వైసీపీ ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి భర్త కాలసాని చెన్నారావు ఇంటిని కూల్చిన ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

మంచినీటి పథకాలపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-విజయవాడ: రక్షిత తాగునీరు, పారిశుద్ధ్యంతో ప్రజల ఆరోగ్య రక్షణ తద్వారా జీవన ప్రమాణాల మెరుగుకు దోహదం చేస్తాయని... దీన్ని దృష్టిలో ఉంచుకొని రక్షిత, సమగ్ర రక్షిత మంచినీటి పథకాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ఛాంబర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్‌బీ రహదారులు, భవనాలుబీ ప్రజారోగ్యం, ఏపీఈడబ్ల్యూఐడీసీ సూపరింటెండింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు.. 7,917 చేతిపంపులతో పాటు 868 రక్షిత మంచినీటి పథకాలు/డైరెక్ట్ పంపింగ్, 19 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు ఉన్నట్లు వివరించారు. అదే విధంగా రక్షిత, సమగ్ర రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ, ఆర్‌వో ప్లాంట్ల స్థితిగతులు, తాగునీరు చెరువుల పరిస్థితి, వివిధ పథకాల ద్వారా పురోగతిలో ఉన్న పనులు, జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనుల పురోగతి తదితరాలకు సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం కలెక్టర్ సృజన మాట్లాడుతూ తాగునీరు ఎట్టిపరిస్థితుల్లోనూ కలుషితం కాకుండా అప్రమత్తతతో పైపులైన్ల లీకేజీలు లేకుండా చూసుకోవాలని.. క్షేత్రస్థాయి అధికారులతో సరైన సమన్వయంతో తాగునీటి సరఫరా వ్యవస్థల రక్షణపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. తాగునీటి నమూనాలను పరీక్షించేందుకు విజయవాడలోని డిస్ట్రిక్ట్ ల్యాబ్‌తో పాటు నందిగామ సబ్ డివిజన్ ల్యాబ్ ఉన్నందున.. వీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు బ్యాక్టీరియలాజికల్ కెమికల్ టెస్ట్‌లు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ ఎ.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డీవీ రమణ, ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాద్‌బాబు, ఆర్ అండ్ బీ ఎస్ఈ వీకే విజయశ్రీ, ప్రజారోగ్యం ఈఈ డి.భూషణం, ఏపీఈడబ్ల్యూఐడీసీ బి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంపై సమీక్ష:

.. పారిశ్రామిక రంగంపైనా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమలు, వాటి పురోగతిపై చర్చించారు. ప్రతి నెలా క్రమంతప్పకుండా జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంఈజీపీ క్రెడిట్ లింక్డ్ రాయితీ పథకంపై సరైన విధంగా అవగాహన కల్పించి.. అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈల అభివృద్ధి, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరక్కుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు, తనిఖీల నిర్వహణ, విపత్తు నిర్వహణకు సంబంధించి మాక్ డ్రిల్స్ నిర్వహణ తదితరాలపై కలెక్టర్ సృజన సూచనలిచ్చారు. సమావేశంలో జీఎం డీఐసీ ఎ.సుధాకర్, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి:

అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యకలాపాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు ప్రవేశాలు, బోధనా సిబ్బంది, మౌలిక వసతులు, పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాలు తదితర అంశాలపై చర్చించారు. నిర్దేశ బోధనా ప్రణాళికకు అనుగుణంగా విద్యా నైపుణ్యాలు అందించేందుకు కృషిచేయాలన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కరిక్యులర్, కోకరిక్యులర్ యాక్టివిటీస్‌ను అమలుచేయాలన్నారు. ప్రతి విద్యార్థిపైనా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. తరచు పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, డిస్ట్రిక్ట్ వొకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, ఆర్‌ఐవో పి.రవికుమార్ పాల్గొన్నారు.

నటవిరాట్యరూపం ఎస్‌విఆర్

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : నటించే ప్రతి పాత్రలోనూ హావ భావాలు ప్రకటించటంలో కొత్తదనాన్ని చూపిస్తూ నటనకు కొత్త భాష్యం పలికిన ఎస్ వి రంగారావు నటవిరాట్స్వరూపమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు.

ఎమ్మెల్యే బోండా ఉమాను కలిసిన ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్

విశాలాంధ్ర-విజయ వాడ: సింగ్‌నగర్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ తరుపున 40 మంది ఫోటోగ్రాఫర్లు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావును బుధవారం మర్యాదపూర్వకంగాకలిశారు. ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు ఒక కమిటీ హాల్ నిర్మించాలని. ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వ సబ్సిడీ రాయితీలు ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బోండా ఉమాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రవికుమార్, కార్యదర్శి రామకృష్ణ, కమిటీ సభ్యులు వాసు ,కే.రామరాజు, రమేష్ , సుభాని కిరణ్, సత్య, గోపీ , ఫణి , ప్రకాష్ , నాని , నాగరాజు , వెంకట్ , రూపుకుమార్ , పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో రెడ్డి సమాజిక వర్గం అంటే ఉన్నతశ్రేణి వర్గంగా భావిస్తున్నారని తమలో కుడా సామాజికంగా అభివృద్ధి చెందకుండా పేదరికంతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని తమను ఆదుకొవటానికి నూతన ప్రభుత్వం అవసరమైన నిధులను రెడ్డి కార్పొరేషన్‌కు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వానికి మంత్రులుగా, శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా, ప్రమాణం స్వీకారం చేసిన రెడ్డి ప్రజా ప్రతినిధులకు ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం తరపున అభినందన తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.గోపాల్ రెడ్డి,యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు దొరకచర్ల భరత్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షరాలు పులుగు సుశీల రెడ్డి,లీగల్ సెల్ కన్వీనర్ కె.రామకృష్ణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి

విశాలాంధ్ర- నందిగామ: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పేద విద్యార్థులు ఉన్నతమైన స్థానాలు అధిరోహిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. బుధవారం నందిగామ ఓసి క్లబ్ లో జరిగిన నందిగామ, తిరువూరు డివిజన్ స్థాయి అన్ ఎయిడెడ్ ప్రైవేట్ యాజమాన్యముల ప్రాథమిక ప్రాథమి కోన్నత మరియు ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్ల సమావేశంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కొత్త ప్రభుత్వం ప్రణాళి కలను సిద్ధం చేసిందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఫలితా లు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ తిరువూరు డివిజన్లకు సంబంధించిన ఎంఈఓ లు మరియు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మైలవరపు దుర్గారావుపై దాడి చేసి పార్టీ జెండా దిమ్మెలను ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ డిమాండ్ చేశారు. జనసేన, టీడీపీ నేతలు ధ్వంసం చేసిన పార్టీ జెండా దిమ్మె ప్రదేశాన్ని ఆసిఫ్ ఇతర కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు బుధవారం ఉదయం పరిశీలించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం అక్కడ శాంతియూతంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఆరాచకాలను సృష్టిస్తున్నారన్నారు. అలాగే పోలీసు అధికారులు సైతం దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైతే ఈ విధమైన దుశ్చర్యలకు పాల్పడ్డారో వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పార్టీకి చెందిన కార్పొరేటర్లు, వివిధ ఆలయాల మాజీ ఛైర్మన్లు, మాజీ డైరెక్టర్లు, కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన మైలవరపు దుర్గారావును ఆయన ఇంటి వద్దకు వెళ్లి ఆసిఫ్ బుధవారం మధ్యాహ్నం పరామర్శించారు. పార్టీ నేతలంతా అండగా ఉంటారని వివరించారు. అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

సంగీత సాహిత్యాల పరిమళం చిత్ర గీతాల గానం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సమైక్య భారతి, జె పి అండ్ రాజ్ స్వరాంజలి టాలెంట్ ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై విశ్వ నట చక్రవర్తి ఎస్ వి ఆర్ 106వ జయంతి సందర్భంగా జరిగిన సినీ సంగీత విభావరి తెలుగు భాష, సినీ సంగీత మాధుర్యాలను శ్రోతలకు పంచుతూ సాగింది. ముఖ్యఅతిథిగా ప్రసిద్ధ చలనచిత్ర దర్శకులు రేలంగి నరసింహారావు, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరై ప్రసంగిస్తూ ప్రపంచీకరణ నేపథ్యంలో పాశ్చాత్య ప్రభావం పడుతున్న నేటి తరుణంలో ఇటువంటి సినీ సంగీత విభావరులు భాషా వికాసాన్ని, సంగీత వికాసాన్ని కలిగిస్తాయని అంటూ కళాకారులను అభినందిస్తూ ప్రసంగించారు.

స్కేటింగ్ పోటీల్లో కేబీఎన్ విద్యార్థికి బంగారు పతకం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి సిహెచ్ రత్నరాజ్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని పొందినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాలను సాధించాడని ఆయన పేర్కొన్నారు. వరుసగా 2000. 3000. ఐదు వేల మీటర్ల స్కేటింగ్ పోటీలలో రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలను సాధించడం జరిగినదని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థిని, అతనిని ప్రోత్సహించిన కళాశాల క్రీడా విభాధిపతి డీ హేమచంద్రరావుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కే రామకృష్ణ ఇతర అధ్యాపకులు అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టండి

విశాలాంధ్ర-విజయవాడ: సమాజానికి శాపంగా తయారైన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదామని, ప్లాస్టిక్ వల్ల నష్టాలు విద్యార్థి దశ నుండే అవగాహన పెంచుకోవాలని ఏకేటీపీఎం ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధాన అధ్యాపకులు సత్యవేణి సూచించారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణా దినం పురస్కరించుకుని ప్రజా ప్రగతి ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ కియో మోటార్స్ వారి సహకారంతో బుధవారం పాఠశాల నందు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల మైదానంలో మొక్కలు నటించారు. ప్లాస్టిక్, సీసాలు, కవర్లు అలంకరించుకుని వినూత్నంగా ప్రదర్శన జరిపారు. ప్లాస్టిక్ నిర్మూలన కోసం అందరం నడుం కట్టాలని పాటలు పాడారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు శ్రీనివాస్, ప్రజా ప్రగతి ట్రస్ట్ ప్రతినిధి ఎమ్ నాగేశ్వరరావు, వెంకటేష్, బాలాజీ ,జగదీష్, చందు, గౌరీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులను అవగాహన సమావేశం నిర్వహించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించటానికి సూచనలు చేశారు.

కాపు కార్పొరేషన్‌కు జనత్వాలు కల్పించాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : కాపులకు ఎంతో ప్రయోజకరంగా ఉన్న రాష్ట్రంలో కాపు కార్పొరేషన్‌కు నూతన జనత్వాలు వచ్చే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొవాలని అమరావతిలోని సచివాలయంలో పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రాఫ్ మంత్రి కందుల దుర్గేష్‌ను కలసి విజ్ఞప్తి చేయటం జరిగిందని కాపు యూత్ ఫోర్స్ వ్యవస్థాపకులు రొక్కం శివ శంకర్ రాయలు తెలిపారు.బుధవారం రొక్కం శివ అధ్వర్యంలో కాపు యూత్ ఫోర్స్ సభ్యులు మంత్రిని కలవడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హాయాంలో కాపు కార్పొరేషన్ ఏవిధంగా నీరుగార్చారనే విషయాలను క్షుణ్ణంగా వివరించామన్నారు. ప్రధానంగా డిఎస్సీ నియామకాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేసి అందులో కాపులకు 5% రిజర్వేషన్ కల్పించాలని కోరామన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి అన్ని విషయాలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి కాపు కులానికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. మంత్రిని కలసిన వారిలో ఈ కార్యక్రమంలో జనసేన నగర సెంట్రల్ నాయకులు యాంపాటి ప్రభూజీ,కాపు యూత్ ఫోర్స్ సభ్యులు ముల్లి శ్రీకాంత్, చలమలశెట్టి శివ గంగాధర్,గంటా సాయి ఉన్నారు.

సకాలంలో జీతాలు-పెన్షన్ల చెల్లింపులు సంతోషదాయకం

ఎపిఎన్ జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు,జేఏసీ ఛైర్మన్ కె.వి శివారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు,పెన్షనర్లకు ఈ మధ్యకాలంలో ఎన్నడు లేనివిధంగా జీతాలు పెన్షన్లు సకాలంలో జమ అవటం ఆనందదాయకమని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.పురుషోత్తం నాయుడు తెలియజేశారు.గత ఐదు సంవత్సరాలుగా ఉద్యోగులు ఉపాధ్యాయులు,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సకాలంలో జీతాలు రాక,జీతాలు ఎప్పుడు పడతాయో తెలియక,పెన్షన్లు జమ కాక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.సమర్థుడైన అనుభవశాలి అయిన ముఖ్యమంత్రి ఉండటం వల్లనే దీని మీద దృష్టి సారించి జీతాలు సకాలంలో చెల్లించారని కొనియాడారు.ఒకప్పుడు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బడ్జెట్ కేటాంపులు ద్వారా జీతాలు చెల్లించేవారని కానీ 2016లో అప్పటి ముఖ్యమంత్రి,ప్రస్తుత సీఎం చంద్రబాబు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కుడా ఒకటో తేదీనే జీతాలు చెల్లించే విధంగా 010 పద్దు ద్వారా చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేశారని తద్వారా వారు జీతాలు పొందుతున్నారన్నారు.కాని వైసిపి గత ఐదు సంవత్సరాలుగా వారికి సకాలంలో జీతాలు ఎప్పుడు రాలేదన్నారు.కొన్ని నెలలుగా జీతాలు రాని ఉద్యోగుల సమస్యలన్నిటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం చేస్తామని తెలిపారు.అంగన్వాడీ ఆశా వర్కర్లు లాంటి చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడే ఉద్యోగులకు కూడా సకాలంలో ప్రాధాన్యత పరంగా జీతాలు చెల్లించాలని కోరారు.ఈ ప్రభుత్వం మీద పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగానే,సామాజిక పెన్షన్లు పరముగారెట్టింపు చెల్లింపులు జరిగినప్పటికీ,ప్రభుత్వం ఉద్యోగులకు కూడా చెల్లింపులలో ఉద్యోగులు పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా చర్యలు చేపట్టడం హర్షదాయకం అన్నారు.

పోలీస్ అధికారులను అభినందించిన డీజీపీ

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలోనే వృతి నైపుణ్యంలో భాగంగా వివిధ క్రీడాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఏపీ పోలీస్ అధికారులను డీజీపీ ద్వారకా తిరుమల రావు అభినందించారు. అస్సాం రాష్ట్రం గౌహతిలో జూన్ 24 నుండి 30వ తేది వరకు ఆరు రోజుల పాటు జరిగిన 9వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్-2024 లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ వృతి నైపుణ్యంలో 09 మెడల్స్(1 స్వర్ణం, 2 రజితం, 6కాంస్య) గెలుసుకొని ఉత్తమ స్థాయి కనబరిచి పతకాలు సాధించిన రాష్ట్ర పోలీస్ అధికారుల బృందం డీజీపీ బుధవారం కలిశారు. జూడో, తైక్వాండో, కరాటే, పెన్‌కాక్-సిలట్, యూషూ అంశాలకి సంభందించిన 5 విభాగాల్లో దేశంలోని 24 రాష్ట్రాలతో పాటు 5 కేంద్ర పాలిత ప్రాంతాలు 11 కేంద్ర సాయుధ బలగాలుకు చెందిన మొత్తం 40 టీంలతో సుమారు 2000 మందికి పైగా పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఐజీ కేవీ.మోహన్ రావు క్రీడలు నేతృత్వంలోని అధికారులతో కూడిన బృందం ఈ పోటీలో పాల్గొన్నారు.

ప్రేక్షక హృదయాల్లో ఎస్వీఆర్ ప్రత్యేక స్థానం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : గంభీరమైన స్వరం, స్పష్టమైన డైలాగ్ డెలివరి అద్భుతమైన నటనతో పాత్రలో హావ భావాలు పలికిస్తూ తనకు తనే పోటీ అనే విధంగా పలు పాత్రలు పోషించిన విశ్వనట చక్రవర్తి యస్వీ రంగారావు అని ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు బేతు రామమోహనరావు కొనియాడారు. గాంధీనగర్‌లోని ఐక్య కాపునాడు కార్యాలయంలో యస్వీ రంగారావు జయంతి వేడుకలు రాష్ట్ర అధ్యక్షులు బేతు రామమోహనరావు ఆధ్వర్యంలో విశ్వనట చక్రవర్తి యస్వీఆర్ 106వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా యస్వీఆర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యస్వీఆర్ విదేశాల్లో గుర్తింపు పొందిన తొలి తెలుగు నటుడు, కాపు జాతి అణిముత్యం అన్నారు. నిలువెత్తు విగ్రహంతో గంభీరమైన స్వరం, స్పష్టమైన డైలాగ్ డెలివరి అద్భుతమైన నటన యస్వీ రంగారావుకే సొంతం అన్నారు. అంతర్జాతీయ స్థాయి కీర్తి పొందిన ఎస్వీఆర్ పేరున భారత ప్రభుత్వం 2013 లో రూ.500 పోస్టల్ స్టాంపు విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు చలమలశెట్టి శ్రీనివాస్,వెలుగంటి లక్ష్మణరావు, ఉమ్మడిశెట్టి కృష్ణమూర్తి,అల్లమళ్ళ సుబ్రహ్మణ్యం, భూపతి మహేష్,వివిధ సంఘాల నాయకులు డీవీ ఎస్ ఎన్ మూర్తి, మల్లెంపూటి శంకర్,భీమరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మార్పుకు క్రైస్తవ విద్య

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సామాజిక మార్పుకు క్రైస్తవ విద్య దోహదం చేస్తుందని సిటిజి యూనివర్సల్ బైబిల్ కాలేజ్ గౌరవ డైరెక్టర్ సాల్మన్ రాజు, డైరెక్టర్ సరోజ సాల్మన్ తెలిపారు. బుధవారం క్రైస్ట్ టు గాస్పల్ మినిస్ట్రీస్ 24వ గ్రాడ్యుయేషన్ అండ్ ఆర్డినేషన్ కార్యక్రమం గాంధీనగర్ లోని హోటల్ శ్రీపాదలో నిర్వహించారు.మినిస్ట్రీస్ ఆధ్వర్యంలోని కళాశాలల్లో క్రైస్తవ విద్యలో పాస్టర్లు 6, సిటిహెచ్, డిప్లమా1, బిటిహెచ్ 8, ఎమ్ టి హెచ్ 2, పీహెచ్డీ 2 పూర్తి చేసిన వారికి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజ్ మాట్లాడుతూ ఒక వ్యక్తి యొక్క విశ్వాసాన్ని ఏర్పరచడంతోపాటు ప్రజల సామాజిక,ఆర్థిక, రాజకీయ, మతపరమైన జీవితాలలో సమాజంలో మార్పులను తీసుకురావడమే క్రైస్తవ విద్య లక్ష్యమని తెలిపారు. 2015 సంవత్సరం నుండి తమ సంస్థ ద్వారా కుల మత వర్గ భేదం లేకుండా పేద విద్యార్థులకు, వృద్ధులకు తమ వంతు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు.అదేవిధంగా ఆసక్తి కలిగిన వారికి క్రైస్తవ విద్యలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లంక విజయ కుమారి, విజయవాడ కాలేజీ ప్రిన్సిపల్ టి నాగభూషణం, అమరావతి కాలేజ్ ప్రిన్సిపాల్ నందూరి ఆదాము,సెక్రటరీ సిహెచ్ డేవిడ్ రాజు,తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్ నటన ఆమోఘం

జనసేన నేతలు తిరుపతి అనూష, సురేష్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తన నటనతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ఏకైక భారతీయ నటుడు ఎస్.వి.రంగారావు అని జనసేన పార్టీ నాయకులు తిరుపతి అనూష, సురేష్‌లు అన్నారు. బుధవారం భవానీపురంలో ఎస్వీఆర్ 106వ జయంతిని పురస్కరించుకుని రంగారావు చిత్రటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరాణిక, సాంఘిక పాత్రలలో తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించి తెలుగు ప్రేక్షకుల విశ్వవిఖ్యాత నట చక్రవర్తిగా చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత నటుడు ఎస్వీ రంగారావు అని అన్నారు. ఎస్వీ రంగారావు వంటి మహా నటుడిని గౌరవించుకోవడం తమ తెలుగు వారికి ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో దాసి రామ్మోహన్, ఆదిత్య రెడ్డి, గణేష్, మణికంత, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బోండా ఉమాను కలిసిన వాసవి క్లబ్ సభ్యులు

విశాలాంధ్ర-విజయవాడ: వాసవి క్లబ్ విజయవాడ అజిత్ సింగనగర్ సభ్యులు స్థానిక శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావును బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైశ్యుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని వారు కోరారు. నగరంలో వాసవి క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోండా ఉమా మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి స్వచ్ఛంద సేవా సంస్థల సహకారం ఉండాలన్నారు. తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొల్లి మల్లికార్జునకుమార్, కార్యదర్శి రామాంజనేయులు, మాజీ అధ్యక్షులు కేవీ భాస్కరరావు, సభ్యులు కేవీ సుబ్బారావు, బొమ్మిసెట్టి రమేష్, శంకర్‌రావు, ప్రకాష్ పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, Galla Rajani Kumari (Old Name) W/o. G. Surya Narayana Rao, R/O- D.No:45-11-7, Thanmabattula Vari Street, Padavalarevu, Gunadala, Vijayawada, NTR District. I Changed my name to **Galla Rajini (New Name)** Hence forth I will be known as **GALLA RAJINI**